క్లుప్తంగా

విజయవంతం చేయండి



మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ రామలింగేశ్వర్

కర్నూలు (టౌన్): అక్టోబర్ 2న గాంధీ జయంతి పురస్కరించుకొని స్వచ్ఛతే సేవా కార్యక్రమాలను విజయవంతం చేయాలని నగరపాలక కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్ పిలుపునిచ్చారు. స్థానిక నగరపాలక కార్యాలయంలో గురువారం మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు స్వచ్ఛతే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అక్టోబర్ 2న కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ దివాస్ నిర్వహిస్తోందన్నారు. ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు, డీఈఈలు నరేష్, దినేష్, టీపీఆర్‌ఓ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిని కలిసిన లీగల్ సెల్ నేతలు

కర్నూలు(లీగల్): వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన ఎస్వీ మోహన్‌రెడ్డిని గురువారం ఆ పార్టీ లీగల్ సెల్ నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ ఎం.ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు పి.సువర్ణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు హనుమంతరెడ్డి, షాషావలి తదితరులు ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛంతో అభినందించారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాల మేరకు జిల్లాలో పార్టీని బలోపేతం చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తామని లీగల్ సెల్ నేతలు అన్నారు.

సీతారాం ఏచూరి మృతి తీరని లోటు

సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరి మృతి దేశానికి తీరని లోటని జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బీ.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ అన్నారు. ప్రజా సమస్యల పట్ల అవగాహన కలిగి పార్లమెంట్‌లో గళం విప్పిన నేత ఏచూరి అన్నారు. ఆయన మృతి సీపీఎంకు పూడ్చలేనిదన్నారు.

14న మొల్లమాంబ విగ్రహావిష్కరణ

కర్నూలు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య సూచనల మేరకు ఈ నెల 14వ తేదీన ఉదయం 10 గంటలకు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో కవయిత్రి మొల్లమాంబ విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సూగూరు వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమానికి జిల్లాకు చెందిన కుమ్మర శాలివాహన సామాజిక వర్గానికి చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

యోగా పోటీల్లో సత్తా చాటాలి

కర్నూలు (టౌన్): ఈనెల 14, 15 తేదీల్లో విశాఖపట్నం జిల్లా భీమిలిలో నిర్వహించనున్న 49వ రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారులు పతకాలే లక్ష్యంగా సత్తా చాటాలని జిల్లా యోగా సంఘం చైర్మన్ శ్రీధర్ రెడ్డి, అధ్యక్షుడు లక్ష్మీకాంతరెడ్డి సూచించారు. గురువారం విశాఖపట్నంకు బయలుదేరుతున్న జిల్లా జట్టును సాగనంపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు అవకాశాలను వినియోగించుకొని ప్రతిభ చాటాలన్నారు. జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు, యోగా సంఘం జిల్లా కార్యదర్శి అవినాష్ శెట్టి పాల్గొన్నారు.

టైంస్కేల్ వర్తింపజేయాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలో కాంట్రాక్ట్ విధానంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు తమకు మినిమం టైంస్కేల్ వర్తింపచేయాలని కోరుతూ వర్సిటీలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇస్తూ నిరసన తెలిపారు. గురువారం ఉద్యోగులు కృష్ణవేణి, కిరణ్మయి, బాబు వర్సిటీ అధికారుల తీరుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు టైంస్కేల్ వర్తింపజేయాలని వర్సిటీ అధికారులకు ఎన్నోసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. జీతాలు పెంచాలని, సమాన పనికి సమాన వేతం ఇవ్వాలని అడిగినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెల్దుర్తి: హైవే- 44పై మదార్‌పురం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్రకు చెందిన శ్రావణ్ మహేశ్ గాయపడ్డాడు. గుంతకల్ నుంచి హైదరాబాద్‌కు కారులో వెళ్తున్న శ్రావణ్ మహేశ్ సంఘటనా స్థలంలో కారు పక్కకు ఆపి డ్రైవింగ్ సీటు నుంచి దిగుతున్న సమయంలో గుర్తుతెలియని వాహనం కారును, మహేశ్‌ను ఢీకొట్టింది. దీంతో శ్రావణ్ మహేశ్ ఎగిరి దూరంగా పడటంతో అతని నడుముకు, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న హైవే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రుడిని హైవే అంబులెన్స్ ద్వారా కర్నూలు ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.

ఎల్లార్తి దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు

హొళగుంద: ఎల్లార్తి గ్రామంలో వెలిసిన షేక్షావలి, షాషావలి దర్గాలను గురువారం భక్తులు దర్శించుకుని భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. దర్గాలో మొక్కులు చెల్లించుకోవడానికి జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, తెలంగాణ తదితర దూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అలాగే మండల కేంద్రంలోని సాయిబన్న, చిణిగితాతా దర్గాలు, షిర్డిసాయిబాబా ఆలయాలను భక్తులు దర్శించుకున్నారు. దర్గా నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

సారూ.. రైతుల ఆకలి తీర్చరూ !

- మార్కెట్ యార్డుల్లో స్తంభించిన భోజన పథకం
- గతేడాది వరకు రాయితీపై రైతులకు కడుపు నిండా భోజనం
- రూ.15కే రుచికరమైన ఆహారం లభించడంతో ఊరట
- ఈ ఏడాది మార్కెట్లకు రైతులు పోటెత్తుతున్నా భోజన సదుపాయం ఊసేలేదు

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో రైతులకు సేవా కార్యక్రమాలు ఎక్కడివక్కడ నిలిచిపోయాయి. గతేడాది వరకు మార్కెట్ యార్డుల్లో అతి తక్కువ ధరకే కడుపు నిండా భోజనం పెట్టే సదుపాయం ఉండేది. ఉమ్మడి జిల్లాలో 15 వ్యవసాయ మార్కెట్ యార్డులు ఉన్నా కేవలం కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు మార్కెట్లలో మాత్రమే వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. ఈ మార్కెట్లలో సేవా కార్యక్రమాల్లో భాగంగా అతి తక్కువ ధరకు భోజనం లభించేది. ప్రస్తుతం మార్కెట్లకు ఉల్లి, వేరుశనగ ఉత్పత్తులు పోటెత్తుతున్నాయి. రోజుకు 500 మంది వరకు రైతులు తాము పండించిన దిగుబడులను మార్కెట్లలో అమ్ముకుంటున్నారు. నెల రోజుల క్రితం నుంచే పంట ఉత్పత్తులు మార్కెట్‌కు వస్తున్నా రైతులకు రాయితీపై భోజనం అందించడం గురించి ఆలోచించే వారు కరువయ్యారు. గతేడాది వరకు మార్కెట్లలో రైతులకు రాయితీపై భోజనం లభించేంది. ఇస్కాన్ ప్రతినిధులు భోజనం తయారు చేసి మార్కెట్ యార్డుల్లో రైతులకు అందించేవారు. ఒక భోజనానికి మార్కెట్ కమిటీ రూ.20 భరిస్తుండగా, రైతులు రూ.15 చెల్లించే వారు. మిగతా ఖర్చును ఇస్కాన్ భరించేది. అంటే రైతులకు కేవలం రూ.15 కే మంచి రుచికరమైన భోజనం లభించేది. మార్కెట్‌లోకి వ్యవసాయ ఉత్పత్తులను తెచ్చే సమయంలోనే రైతులకు భోజనం టోకెన్ ఇచ్చేవారు. ఈ టోకన్ తీసుకెళ్లి రూ.15 చెల్లిస్తే భోజనానికి అనుమతి ఇస్తూ మరో టోకెన్ ఇస్తారు. ఇది తీసుకెళ్లి భోజనం చేయవచ్చు. ఇందుకోసం మార్కెట్ యార్డులో ప్రత్యేకంగా భోజనశాలను కూడా ఏర్పాటు చేశారు.

ఊసేలేని రాయితీ భోజన పథకం

ఈ ఏడాది మార్కెట్‌కు వ్యవసాయ ఉత్పత్తులు పోటెత్తుతున్నా రాయితీ భోజనం ఊసే లేకుండా పోయింది. రాయితీ భోజన సదుపాయం లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బయట హోటళ్లలో భోజనం చేయాలంటే ఒకరికి రూ.100 వరకు ఖర్చవుతుంది. పంటను అమ్ముకునేందుకు రైతు వెంట సహాయకారిగా మరొకరు వస్తారు. వారికి భోజనం ఖర్చులు భరించలేనివిగా మారాయి. రాయితీ భోజన సదుపాయం కల్పించాలని రైతులు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్ కమిటీలకు పాలక వర్గాలు లేవు. కర్నూలు, ఆదోని మార్కెట్లకు మార్కెటింగ్ శాఖ జేడీ, ఎమ్మిగనూరు మార్కెట్‌కు మార్కెటింగ్ శాఖ ఏడీలు పర్సనల్ ఇన్‌చార్జ్‌లుగా ఉన్నారు. వీరికి పాలక వర్గాలకు ఉన్నట్లే అన్ని అధికారాలు ఉంటాయి. అయితే రాయితీ భోజనం గురించి ఆలోచించే తీరిక పర్సన్ ఇన్‌చార్జ్‌లకు లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని రాయితీ భోజన కార్యక్రమాన్ని అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.



కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో నిరుపయోగంగా మారిన రైతు భోజనశాల

కోట్ల బ్యారేజీకి నీటి ప్రవాహం

కర్నూలు సిటీ: తుంగభద్ర నదిపై నిర్మించిన కోట్ల విజయభాస్కర్ రెడ్డి (సుంకేసుల) బ్యారేజీకి నీటి ప్రవాహం కొనసాగుతోంది. గురువారం ఎగువ నుంచి వస్తున్న నీటి ప్రవాహం కొంత తగ్గింది. 33,798 క్యుసెక్కుల నుంచి 22,641 క్యుసెక్కులకు తగ్గింది. బ్యారేజీ గేట్లు 5 పైకెత్తి 20,196 క్యుసెక్కుల నీరు, కేసీ కాలువకు 2,445 క్యుసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

కర్ణాటక ప్రాజెక్టులతో జిల్లాకు అన్యాయం

కర్నూలు(న్యూసిటీ): తుంగభద్ర నదిపై కర్ణాటక ప్రభుత్వం చేపడుతున్న బ్రిడ్జి, బ్యారేజ్ నిర్మాణంతో కర్నూలు జిల్లాకు తీవ్ర అన్యాయం జరుగుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సీపీఎం నాయకులు ఇరిగేషన్ సీఈ కబీర్‌పాషాను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ.. కర్ణాటక ఇరిగేషన్ మంత్రితో జిల్లా ఇరిగేషన్ అధికారులు, టీడీపీ ఎంపీ బస్తిపాడు రహస్య సమావేశాలు ఎందుకు నిర్వహించారని ప్రశ్నించారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని కర్ణాటక ప్రభుత్వంతో చర్చలు జరిపి జిల్లా అన్నదాతలకు, ప్రజలకు అన్యాయం కలిగించే కర్ణాటక ప్రాజెక్టులను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు.



వినాయక ఘాట్‌లో..



జొహరాపురంలో..



ఎన్ఆర్ పేటలో..



డీపీఆర్‌ఓ కాంపౌండ్‌లో..



చాణిక్యపురి కాలనీలో..

●పార్వతీ తనయా.. పాహిమాం

కర్నూలు కల్చరల్: వినాయక నవరాత్రి మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. కర్నూలు నగరంలో ఆరవ రోజు గురువారం వినాయకుడి ఆలయాలతో పాటు గణనాథుని మండపాల వద్ద ప్రత్యేక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండపాల వద్ద గణపతి హోమాలు, అర్చనలు, సామూహిక కుంకుమార్చనలు, విష్ణు, లలితా సహస్ర పారాయణాలు జరిగాయి. భజనలు, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పిల్లలు, మహిళలకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కుమ్మరి వీధి, ఎర్రబురుజుల్లోని వినాయక మండపాల వద్ద నిర్వహించిన పూజల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



వినాయక పూజలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి



వీఆర్ కాలనీ రోడ్ నంబర్- 4లో..



అశోక్‌నగర్‌లో వెలసిన వినాయకుడు



స్కందా హైబిస్కస్‌లో..



సప్తగిరి నగర్ బీకే సింగ్ టవర్స్‌లో..



పాతకల్లూరులో..

రక్తహీనతను నివారించాలి

కర్నూలు(హాస్పిటల్): కౌమార దశ నుంచి బాలికల్లో రక్తహీనత రాకుండా కుటుంబసభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలని డెమో శ్రీనివాసులు సూచించారు. గురువారం స్థానిక ఎ.క్యాంపులోని ఇందిరాగాంధీ స్మారక నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో కిశోర బాలికలకు రక్తహీనత, నులిపురుగుల నివారణ, పౌష్టికాహారం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గురువారం ఐరన్‌ఫోలిక్ యాసిడ్ మాత్రను భోజనం తర్వాత తీసుకోవాలన్నారు. విద్యార్థులు మానసికంగా, దృఢంగా ఎదగడం కోసం నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రను భోజనం చేసిన తర్వాత చప్పరించి మింగాలని సూచించారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ పద్మావతి, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.



అవగాహన పోస్టర్లను ప్రదర్శిస్తున్న అధికారులు

ఆయిల్ ట్యాంకర్ ఢీకొని వ్యక్తి మృతి



మృతుడు గిడ్డయ్య (ఫైల్)

ఆదోని అర్బన్: పట్టణంలోని ఆలూరు రోడ్డులోని కల్లు బావి వీధికి చెందిన గిడ్డయ్య(54)ను ఆయిల్ ట్యాంకర్ లారీ ఢీకొట్టడంతో గురువారం మృతిచెందాడు. ట్రాఫిక్ ఏఎస్ఐ లక్ష్మన్న తెలిపిన మేరకు వివరాలు.. గిడ్డయ్య ఉదయం బహిర్భూమికి వెళ్లి ఇంటికి తిరిగొస్తున్న సమయంలో వెనుక నుంచి ఆయిల్ ట్యాంకర్ వచ్చి ఢీకొట్టింది. దీంతో గిడ్డయ్య అక్కడికక్కడే మృతిచెందాడన్నారు. మృతుడికి భార్య సరోజమ్మ, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. కుమారుడు ఈరన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఖాదర్‌లింగస్వామి దర్గాకు పోటెత్తిన భక్తులు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారు జామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాష చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు. భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కోసిగి: మండల కేంద్రం కోసిగికు చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్ పై అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా దాడులు చేసి పట్టుకున్నట్లు కోసిగి సెబ్ సీఐ మహబూబ్ బాషా, ఎస్ఐ రమేష్‌బాబులు తెలిపారు. గురువారం గ్రామాల్లో పర్యటిస్తుండగా దేవరబెట్ట క్రాస్ రోడ్డు వద్ద కోసిగికు చెందిన కంపాటి మధు కృష్ణ, భూగేని రవిలు బజాజ్ పల్సర్ బైక్‌పై 768 ఒరిజనల్ చాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. రెండు బైక్‌లను, మద్యం బాటిళ్లను సీజ్ చేసి ఇద్దరిని అరెస్టు చేశామన్నారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ కె.నాగరాజు, కానిస్టేబుల్ యస్, నాగరాజు, మధుసూదన్‌లు ఉన్నారు.

ముగిసిన హ్యాండ్‌బాల్ పోటీలు

కర్నూలు (టౌన్): నగరంలోని స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి బాలబాలికల అంతర్ పాఠశాలల హ్యాండ్‌బాల్ పోటీలు గురువారం సాయంత్రం ముగిశాయి. బాలుర విభాగంలో సెయింట్ జోసెఫ్ పాఠశాల జట్టు, బాలికల విభాగంలో డోన్ కేజీబీవీ జట్లు విజేతలుగా నిలిచాయి. స్పోర్ట్స్ ప్రమోటర్ శ్రీధర్ రెడ్డి పాల్గొని విజేతలకు ట్రోఫీలు, పతకాలు అందజేశారు. బాలుర విభాగంలో సెయింట్ జోసఫ్ పాఠశాల (మొదటి), గూళ్యం జెడ్పీ స్కూల్ (ద్వితీయ), ఆదర్శ విద్యా మందిర్ (తృతీయ స్థానం), బాలికల విభాగంలో డోన్ కేజీబీవీ (మొదటి), మాంటిస్సోరి స్కూల్ (ద్వితీయ), గూళ్యం జెడ్పీ స్కూల్ (తృతీయ) స్థానాల్లో నిలిచాయి. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, క్రీడా సంఘాల ప్రతినిధులు చిన్న సుంకన్న పాల్గొన్నారు.



ట్రోఫీతో విజేత సెయింట్ జోసెఫ్ స్కూల్ జట్టు

స్వచ్ఛతలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(న్యూసిటీ): స్వచ్ఛతే సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ రంజిత్‌బాషా సూచించారు. ఆయన గురువారం జిల్లా అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛతే సేవా కార్యక్రమ నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంపై గ్రామాలలో ర్యాలీలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములు చేసి విజయవంతం చేసేలా చూడాలన్నారు. అలాగే పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వినాయక నిమజ్జన ఏర్పాట్లపై సమీక్ష

కర్నూలు కల్చరల్: ఈ నెల 15వ తేదీన వినాయక నిమజ్జనం నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో.. వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై జిల్లా అధికారులు, గణేష్ మహోత్సవ కేంద్ర సమితి ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ప్రజలకు అసౌకర్యం కలగకుండా నిమజ్జన ఏర్పాట్లు చేయాలన్నారు. నీటి సరఫరా, పోలీస్ బందోబస్తు, రూట్‌మ్యాప్, గజ ఈతగాళ్లు, నిమజ్జన క్రేన్లు, విద్యుత్‌సరఫరా, మెడికల్ క్యాంప్‌లు, తాగునీటి సౌకర్యం, అంబులెన్సు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆర్‌అండ్‌బీ వారు వినాయక ఘాట్‌లో బారీకేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్ రామలింగేశ్వర్ మాట్లాడుతూ.. నిమజ్జనం జరిగే ప్రాంతంలో ప్రకాశవంతమైన విద్యుత్ దీపాలు, పెయింటింగ్ పనులు, ఘాట్‌లను శుభ్రపరిచే పనులు మొదలు పెట్టామన్నారు. నిమజ్జనం తిలకించేందుకు ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ చిరంజీవి, ఆర్‌డీఓ శేషిరెడ్డి, వివిధ శాఖల అధికారులు, గణేష్ మహోత్సవ కేంద్ర సమితి జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, నగర అధ్యక్షులు డాక్టర్ మోక్షేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

సీతారాం మృతి తీరని లోటు

కర్నూలు(న్యూసిటీ): ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టు ప్రత్యేకతను చాటిచెప్పిన వ్యక్తి సీతారాం ఏచూరి అని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ అన్నారు. సీతారాం ఏచూరి గురువారం మృతి చెందడంతో నగరంలోని సుందరయ్య భవన్‌లో సీపీఎం నాయకులు సంతాప సభ ఏర్పాటు చేసి నివాళులర్పించారు. వారు మాట్లడుతూ.. జిల్లాకు ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ, సేవలను కొనియాడారు.

కర్నూలు న్యూసిటీ: జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి ఉద్యమ పోరాటలకు తీవ్రలోటని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మృతికి సీపీఐ తరపున సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా గిడ్డయ్య మాట్లాడుతూ.. కర్నూలు నగరంలో సీపీఐ, సీపీఎం మహాసభలలో ఆయన పాల్గొన్నట్లు గుర్తుచేశారు. రెండుసార్లు రాజ్యసభ ఎంపీగా ప్రాతినిధ్యం వహించి ప్రజల సమస్యలపై గళమెత్తారన్నారు. ప్రజా, కార్మిక, శ్రమజీవుల ఉద్యమాలకు నాయకత్వం వహించి అలుపెరగని పోరాటాలు చేశారని కొనియాడారు.

ఆసుపత్రిలో పారిశుద్ధ్యం మెరుగుపడాలి



ఆసుపత్రి పరిసరాలను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రిలో పారిశుద్ధ్యం మరింత మెరుగుపడాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. ఆయన గురువారం ఆసుపత్రిలోని పలు విభాగాలను తనిఖీ చేశారు. గైనిక్ విభాగంలో వాటర్, ట్యాప్‌ల మరమ్మతులను పూర్తి చేయాలని ప్లంబర్‌కు చెప్పారు. గైనిక్ డీఆర్ వన్‌లో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్ల గురించి ఆరా తీశారు. లేనిచోట కొత్త ఫ్యాన్లను ఏర్పాటు చేయాలని ఎలక్ట్రికల్ సిబ్బందిని ఆదేశించారు. ఎమర్జెన్సీ ఓటీలో ఉన్న కండోమినేషన్ పరికరాలను త్వరగా తరలించాలన్నారు. ఆయన వెంట సీఎస్ఆర్‌ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్‌ఎంఓ డాక్టర్ హేమనళిని, ఏఆర్‌ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్, ఏడీ రమేష్ బాబు, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రి బాయి ఉన్నారు.

సకాలంలో వైద్యమందిస్తే మాతృమరణాలకు చెక్

● డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులకు సరైన సమయంలో వైద్య సేవలు అందించడం ద్వారా మాతృమరణాలను తగ్గించవచ్చని కమిటీ నిర్ధారించింది. డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ ఆధ్వర్యంలో గురువారం ఆయన ఛాంబర్‌లో మాతృమరణాలపై సమీక్ష నిర్వహించారు. జూన్, జులై, ఆగస్టు మాసాల్లో సంభవించిన మరణాలపై సమీక్ష చేశారు. క్షేత్రస్థాయిలోని సిబ్బంది ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు గర్భవతులను 12 వారాల్లోపు గుర్తించి వివరాలు నమోదు చేసుకుని సకాలంలో వైద్యసేవలు అందించేలా చూడాలన్నారు. గర్భిణుల్లో ప్రమాదకర లక్షణాలు ఉంటే ఆరోగ్య కార్యకర్త, పర్యవేక్షకులతో ట్రాక్ చేసి సమీప సామాజిక ఆరోగ్య కేంద్రం, ఏరియా ఆసుపత్రులు, ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు 108 ద్వారా తరలించి సత్వర చికిత్స అందించడం ద్వారా మాతృమరణాలను తగ్గించవచ్చన్నారు. దీనిపై గర్భిణుల కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలచాలన్నారు. సమావేశంలో డిస్ట్రిక్ట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ నాగప్రసాద్‌బాబు, డీపీఎంఓ డాక్టర్ ఉమా, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సత్యవతి, వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో చర్చిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్

ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



మాట్లాడుతున్న క్లస్టర్ వర్సిటీ వీసీ డీవీఆర్ సాయిగోపాల్

కర్నూలు సిటీ: ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ దిశగా కృషి చేయాలని క్లస్టర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. గురువారం బీక్యాంపులోని సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో 2024-25 మొదటి సంవత్సర బ్యాచ్ విద్యార్థులకు కోర్సు ఒరియేంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు మొదటి నుంచే ఓ నిర్దిష్టమైన ప్రణాళిక వేసుకొని చదివితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఆయా సబ్జెక్టుల విభాగాధిపతులు వారి సబ్జెక్టుల గురించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి.ఎస్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.